సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం । 3 । డిసెంబర్ । 2024



సోమశిలకు పెరుగుతున్న ఇన్‌ఫ్లో

ఆత్మకూరు: పైతట్టు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో సోమశిల జలాశయానికి ఇన్‌ఫ్లో సోమవారం ఉదయానికి 7,331 క్యూసెక్కులకు వస్తుండగా సాయంత్రానికి 9,963 క్యూసెక్కులకు పెరిగింది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.78,440
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.7,108
3శాతం జీఎస్టీతో	రూ.7,321
సవర (8గ్రా)	రూ.58,568

గరిష్టం/కనిష్టం
30.1 /25.0

వాతావరణం

జిల్లాలో చలి పెరిగింది. గాలిలో తేమ సోమవారం 97 శాతంగా నమోదైంది. మంగళవారం ఒకటి, రెండుచోట్ల ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

వైన్ షాపు తొలగించండి



కలెక్టర్‌కు వినతిపత్రమిస్తున్న నాయకులు

నెల్లూరు(అర్బన్): నగరంలోని వాకర్స్ రోడ్డులో పాఠశాలలు, ఇళ్లు, మసీదుల మధ్య ఏర్పాటు చేసిన లక్కీవైన్‌షాపును తొలగించాలని స్థానికులు సయ్యద్ నవీద్ అహ్మద్, సర్దార్, షకీల్, సందాని తదితరులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఆనంద్‌కు అర్జీ ఇచ్చి మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన వైన్ షాపును తొలగించాలని గత 28 రోజులుగా మహిళలు, పిల్లలు ఆందోళనలు చేస్తున్నామన్నారు. దీంతో స్పందించిన కలెక్టర్ వైన్‌షాపును అక్కడి నుంచి తొలగించాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. దీంతో వారు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల ఆలోచనల్లో మార్పు రావాలి



మాట్లాడుతున్న విజయభాస్కరరావు

వెంకటాచలం: విద్యార్థుల ఆలోచనా విధానాల్లో మార్పులు రావాలని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ఇన్‌చార్జి వీసీ విజయ భాస్కరరావు సూచించారు. కాకుటూరు వద్ద వీఎస్‌యూలో సోమవారం ఆవిష్కరణ, ఇంక్యుబేషన్, ఉపాధిపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ ఇలాంటి ఆవిష్కరణ వేదికలు యువతలో సృజనాత్మకతను, కొత్త ఆలోచన పట్ల ఆసక్తిని పెంచే అవకాశం కల్పిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు తమ ఆలోచనలను వాస్తవ ప్రపంచ సమస్యలకు పరిష్కారాలుగా చూపే విధంగా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు నిపుణులు తమ అనుభవాలు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.


పాలనలో దుర్నీతి

ప్రతి శాఖలో రాజ్యమేలుతున్న అవినీతి

- ఎమ్మెల్యేలు చెప్పిందే శాసనంగా అమలు
- రీచ్‌ల్లోంచి రాత్రివేళల్లో అక్రమంగా ఇసుక రవాణా
- ఇరిగేషన్ శాఖలో టెండర్లు ఓపెన్ చేయకుండానే పనులు పూర్తి
- సైదాపురంలో అనధికారికంగా మైనింగ్ దందా
- నుడా, కార్పొరేషన్‌లో లంచాలతోనే పనులు
- కలెక్టర్‌కు నుడా అవినీతిపై ఫిర్యాదు చేసిన టీడీపీ నేత ఆనం

"ఐఏఎస్ అధికారులూ.. బదిలీపై నెల్లూరుకు రావద్దు.. మిమ్మల్ని తప్పుదోవ పట్టించి బలిచేస్తారు. గత రెండు నెలలుగా నుడా, కార్పొరేషన్‌లో అవినీతి రాజ్యమేలుతోంది. నుడాలో లంచం ఇస్తే ఏ పనైనా క్షణంలో అయిపోతుంది. తిరుపతి జిల్లాలో వేసిన లేఅవుట్‌కు నెల్లూరు నుడా అనుమతి ఇచ్చింది. అందులో పనిచేసే ఉద్యోగి బిల్డర్‌గా అవతారమెత్తి నిబంధనలకు విరుద్ధంగా భవంతులు నిర్మిస్తున్నాడు. కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ ప్రతి ఫైల్ క్షుణ్ణంగా పరిశీలించి సంతకం చేయాలి. లేకపోతే బలైపోతారు. ఇంకా నావద్ద కార్పొరేషన్, నుడాకు సంబంధించిన అక్రమాల జాబితా ఎంతో ఉంది. అవన్నీ త్వరలోనే బయటపెడతా"

➡ ఈ మాటలు అన్నది ఎవరో ప్రతిపక్షనేత కాదు. అధికార పార్టీకి చెందిన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ ఆనం వెంకట రమణారెడ్డి సోమవారం మీడియా ముందు చెప్పారు.



సాక్షి టాస్క్‌ఫోర్స్ : కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ శాఖల్లో అవినీతి పరాకాష్టకు చేరిందని అధికార పార్టీ కీలక నేతలే మీడియా ముందుకు వచ్చి చెపుతున్నారంటే జిల్లా పరిపాలన అస్తవ్యస్తంగా ఉందనేందుకు ఇంతకంటే తార్కాణం ఏం కావాలి. జిల్లా పాలనా యంత్రాంగం స్థానిక ఎమ్మెల్యేల కనుసన్నల్లో నడుస్తుండడంతో అధికారులు ఇష్టారాజ్యంగా పనిచేస్తున్నారు. పాలనపై కలెక్టర్ సైతం పట్టు సాధించలేక పోవడంతో పారదర్శకత లోపించింది. ప్రతిపనికి రేటు కట్టి అధికారులు దండకాలు ప్రారంభించారు. నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు చెప్పిందే శాసనంగా అమలు చేస్తుండడంతో అవినీతి, అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. కళ్లముందే అవినీతి జరుగుతున్నా.. సహజ వనరులు దోపిడీ చేస్తున్నా ఉన్నతాధికారులు కళ్లప్పగించి చూస్తున్నారే తప్ప.. అవినీతి నిర్మూలన చర్యలు చేపట్టడం లేదు. ఉన్నతాధికారులే మౌనం దాల్చడంతో కిందస్థాయి అధికారులు, ఉద్యోగులు ఇష్టారాజ్యంగా మసలుకుంటున్నారు. అవినీతికి రాచబాట వేసి లంచం లేనిదే పని చేయడం మానేశారు.

ఇరిగేషన్ శాఖలో అవినీతి



ఇరిగేషన్ శాఖలో అధికారులు బరితెగించారు. లోకల్ ఎమ్మెల్యేలు చెప్పిందే వేదంగా భావించి నిధులు స్వాహా పర్వానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశారు. సర్వేపల్లిలో కాలువల పూడిక తీత పనులు కోసం టెండర్ల దశలో ఉండగానే పనులు తూతూమంత్రంగా కానిచ్చేసి బిల్లులు పెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. కోవూరులో ఇదే పరిస్థితి. పెన్నా నదిలో డ్రెడ్జింగ్ విధానంలో ఇసుక పూడికతీత వ్యవహారంలో హైకోర్టు ఉత్తర్వులనే ధిక్కరించి అక్రమార్కులకు తోడుగా నిలిచారు.

ఊరూరా బెల్టు దుకాణాలు



మద్యం పాలసీని ఎక్సైజ్ అధికారులు అస్తవ్యస్తంగా చేశారు. మద్యం దుకాణాల దరఖాస్తుల ప్రక్రియ నుంచి షాపుల ఓపెనింగ్ వరకు స్థానిక ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే పనిచేశారు. ప్రస్తుతం బెల్టుదుకాణాలు ఊరూరా వెలిసేలా ప్రోత్సహిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నేషనల్ హైవేకు పక్కనే మద్యం దుకాణాలు ఏర్పాటు చేసినా పట్టించుకోవడంలేదు. వేలంపాటలు ద్వారా బెల్టు దుకాణాల కేటాయింపులు చేయిస్తున్నారు. అయినా నెలవారీ మామూళ్ల మత్తులో ఎక్సైజ్ శాఖ నిద్రనటిస్తోంది.

రేషన్ దందాకు సహకారం



జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో స్థానిక షాడో ఎమ్మెల్యేల కనుసన్నల్లో రేషన్ దందా నడిపిస్తున్నారు. నెల్లూరుకు చెందిన ఓ రేషన్ మాఫియా నేత ఆధ్వర్యంలో ఒక్కో నియోజకవర్గం ఒక్కొక్కరికి పంచేశారు. ప్రతినెలా రూ.లక్షల్లో లోకల్ షాడోలకు కప్పంకడుతూ రేషన్ బియ్యం నెల్లూరుకు తరలించి.. మిల్లుల్లో పాలిష్ చేసి తిరిగి మార్కెట్‌లోకి పంపుతున్నారు. చెన్నై, కృష్ణపట్నం పోర్టు ద్వారా విదేశాలకు ఎగుమతులు చేస్తున్నారు.

ఇసుక దోపిడీ



ఉచిత ఇసుక పేరుతో జిల్లాలో దోపిడీ చేస్తున్నారు. పెన్నానదిలో ఎక్కడా ఇసుక తవ్వకాలకు అనుమతి లేదు. ఇంకా పర్యావరణ అనుమతులు రాలేదు. కానీ జిల్లాలో రాత్రయితే చాలు పడమటి కంభంపాడు, ముదివర్తి, సంగం, ఇరువూరు, పొట్టేపాళెం, సూరాయపాళెం, మినగల్లు, నెల్లూరురూరల్ రీచ్‌ల్లో యంత్రాలు పెట్టి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఈ విషయం జిల్లా అధికార యంత్రాంగానికి తెలిసినా ఎవరూ ఆపే సాహసం చేయరు. రోజువారీగా వేల టన్నుల ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది.

సైదాపురంలో మైనింగ్ దందా



సైదాపురంలో తెల్లరాయి క్వార్ట్‌జ్ మెటల్ అక్రమంగా తరలిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆరునెలలుగా మైనింగ్ అనుమతులు అన్నింటిని రద్దుచేసినా అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. స్థానిక ప్రజాప్రతినిధి కనుసన్నల్లో నిత్యం రాత్రివేళల్లో క్వార్ట్‌జ్ మెటల్ తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికే దాదాపు లక్ష టన్నుల వరకు అక్రమ రవాణా చేసినట్లు ఆరోపణలున్నాయి.

కార్పొరేషన్, నుడాలో అవినీతి

నెల్లూరు కార్పొరేషన్, నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా)లో అధికారులు అవినీతికి పాల్పడుతున్నట్లు అధికార పార్టీ నేత ఆనం వెంకట రమణారెడ్డి స్వయంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారంటే అక్కడ పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. తిరుపతి జిల్లా చిల్లకూరులో వేసిన లేఅవుట్‌కు నెల్లూరు నుడా అనుమతి ఇవ్వడం చూస్తుంటే అవినీతి పరాకాష్టకు చేరిందనే చెప్పాలి. అక్కడ పనిచేసే ఉద్యోగులే బిల్డర్స్‌గా మారి భవన నిర్మాణాలు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలకు అనుమతులు కూడా ఇస్తున్నారు. కార్పొరేషన్‌లో పనిచేసే అధికారులు, ఉద్యోగులు రోజువారీగా రూ.లక్ష లంచం లేనిదే ఇంటికి వెళ్లడం లేదని స్వయంగా ఆనం మీడియా ముందు చెప్పడం చూస్తుంటే అవినీతి పరాకాష్టకు చేరిందని అధికార పార్టీ నేతలే ఒప్పుకుంటున్నారు.

దగదర్తి పోలీస్ స్టేషన్ ఎదుట టీడీపీ నేత మాలెపాటి నిరసన



దగదర్తి స్టేషన్ ముందు బైఠాయించిన మాలెపాటి

కావలి: "కావలి నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలకు రక్షణ లేకుండా పోయింది. నానా హింసలు పడుతున్నారు. ఎక్కడ చూసినా బెల్టుషాపులే. వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలి. సీఎం చంద్రబాబు, నారా లోకేశ్ జోక్యం చేసుకుని కావలి నియోజకవర్గాన్ని సరిచేయాలి" అంటూ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలెపాటి సుబ్బానాయుడు వాపోయాడు. దగదర్తి మండలంలో ఓ భూవివాదం సందర్భంగా టీడీపీ నాయకులు నారుమళ్లు ధ్వంసం చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీన్ని నిరసిస్తూ సుబ్బానాయుడు దగదర్తి పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి సోమవారం నిరసన తెలిపారు. టీడీపీ కార్యకర్తలపైనే కేసులు పెడతారా అంటూ వీరంగం చేశాడు. నారుమళ్లు తీసేయమని నేనే మనుషులను పంపించా, అయితే ఏందీ అంటూ పెద్దపెద్దగా కేకలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కావలి నియోజకవర్గంలో కార్యకర్తలకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపణలు చేశారు. వెంట వచ్చిన మహిళలు మాట్లాడుతూ మద్యం బెల్టుషాపులు ఊరూరా పెట్టారని వాటిని తొలగించాలన్నారు.

పెద్దాస్పత్రి అభివృద్ధి నూతన కమిటీ నియామకం

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (పెద్దాస్పత్రి) డెవలప్‌మెంట్ సొసైటీ నూతన కమిటీని సోమవారం ప్రకటించారు. ఈ కమిటీని కలెక్టర్ ఆమోదించారు. కమిటీలో ఐదు మంది సభ్యులుంటారు. వారిలో గతంలో పనిచేసిన బుజబుజనెల్లూరుకి చెందిన వీరబ్రహ్మారెడ్డి, మడపర్తి శ్రీనివాసులు ఉన్నారు. పొదుపు గ్రూపుకి చెందిన అబిదా సుల్తానాను, నగరానికి చెందిన దారా మల్లికార్జునను కమిటీలోకి తీసుకున్నారు. కూటమి తరపున బీజేపీకి చెందిన మొగరాల సురేష్‌ను కూడా కమిటీలోకి తీసుకున్నారు. వీరందరూ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయాల్సి ఉంటుంది. త్వరలోనే వీరిలో ఒకరిని కోఆర్డినేటర్‌గా నియమించే అవకాశం ఉంది.

కలెక్టరేట్‌లో వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

- తన పొలం ఆక్రమించారని, న్యాయం చేయాలని వేడుకోలు



హైమావతిని అడిగి వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

నెల్లూరు(అర్బన్): నెల్లూరు నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కారవేదిక వద్ద కలెక్టర్, ఇతర అధికారుల సాక్షిగా మనుబోలు మండలం వీరంపల్లికి చెందిన పొట్టేటి హైమావతి అనే వృద్ధురాలు ఆత్మహత్యా ప్రయత్నానికి పూనుకుంది. వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను శరీరం మీద పోసుకుంటుండగా పక్కనే ఉన్న పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకుని కాపాడారు. ఈ సందర్భంగా బాధితురాలు హైమావతి మాట్లాడుతూ వీరంపల్లిలో తనకు 50 సెంట్ల పొలం పూర్వీకుల నుంచి వచ్చిందని, అందులో సాగుచేసుకుంటున్నామన్నారు. తన పొలానికి పక్కనే పొలం గల గోనుపల్లి ప్రభాకర్ ఆయన పొలంలో కలిపేసుకున్నారన్నారు. తన పొలం తనకు ఇప్పించాలని ఐదేళ్లుగా రెవెన్యూ, పోలీసు అధికారుల చుట్టూ తిరిగినా న్యాయం జరగలేదన్నారు. పొలాన్ని ఆక్రమించిన వ్యక్తి రాజకీయ నాయకుల అండదండతో లెక్కచేయడంలేదన్నారు. అధికారుల చుట్టూ తిరిగి వేసారిపోయిన తనకు జీవితంపై విరక్తి చెంది కలెక్టరేట్‌లో ఆత్మహత్యా ప్రయత్నం చేశానని ఏడుస్తూ చెప్పారు. విషయం తెలిసిన కలెక్టరేట్ అధికారులు ఆమె వద్దకు వచ్చి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆమె వెనుదిరిగారు.



ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసిన హైమావతి

ట్యాంక్‌బండ్ పనులకు రూ.కోటి లంచం

ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు అవినీతి మరక

- ఎమ్మెల్యే పీఏ తీసుకున్నాడంటూ లేఖ ప్రతులు వైరల్
- కాంట్రాక్టు పనికోసం పోటీపడిన టీడీపీలోని రెండు వర్గాలు
- పాత కాంట్రాక్టర్‌కే పనులు అప్పగించిన ఎమ్మెల్యే
- ఆగ్రహంతో గుట్టు రట్టు చేసిన అసంతృప్త నేతలు

ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు అవినీతి మరక అంటుకుంది. ఉదయగిరి ట్యాంకు బండ్ నిర్మాణ పనులకు సంబంధించి ఓ వ్యక్తి నుంచి ఎమ్మెల్యే పీఏ రూ.కోటి లంచం తీసుకున్నారంటూ ఇటీవల లేఖ ప్రతులు ఉదయగిరి నియోజకవర్గంలో హల్‌చల్ చేశాయి. టీడీపీలో ఉన్న వర్గ విభేదాల మూలంగా ఈ అవినీతి గుట్టును ఆ పార్టీ నేతలే రట్టు చేసుకున్నారనే ప్రచారం జరుగుతోంది.

సాక్షి టాస్క్‌ఫోర్స్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉదయగిరి ట్యాంక్ బండ్ అభివృద్ధికి జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.9 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ పనులను అప్పటి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్య అనుచరుడు ఉదయగిరి పట్టణానికి చెందిన వ్యక్తి దక్కించుకొని రూ.4 కోట్ల మేర పనులు చేశారు. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రావడం.. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడం తెలిసిందే. దాంతో పనులు ఆగిపోయాయి. అయితే ట్యాంక్‌బండ్ పనులపై కన్నేసిన ఉదయగిరికి చెందిన టీడీపీ నేతలు ఎలాగైనా తామే ఆ కాంట్రాక్టు పొందాలని ఎమ్మెల్యే వద్ద తీవ్ర ప్రయత్నం చేశారు. కానీ ఈ పనులు వారికి దక్కలేదు. టీడీపీలో ఉన్న వర్గపోరు నేపథ్యంలో ఒక వర్గం వారు తమకు ఆ పనులు రాకుండా మరో వర్గం అడ్డుకున్నదని భావించింది. దీంతో వారే ఈ గుట్టును బహిరంగం చేశారని తెలుస్తోంది.

మళ్లీ అతనికే పనులు

ఈ క్రమంలో గత ప్రభుత్వంలో పనులు చేసిన కాంట్రాక్టర్ ఈ పనులు తానే కొనసాగించేలా ప్రయత్నం చేశారు. ఇరిగేషన్ శాఖలో ఉన్న ఓ కీలక అధికారి ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడి ద్వారా పైరవీలు జరిపి రూ.కోటి లంచం రూపంలో ఇచ్చే ఒప్పందం కుదుర్చుకొని.. అందులో రూ.50 లక్షలు మేర చెల్లించి పనులు ప్రారంభించినట్లు ప్రచారం జరుగుతోంది. టీడీపీ నేతల దగ్గర లంచం తీసుకుని పనులు ఇస్తే ఈ విషయం అందరికీ తెలిసే అవకాశం ఉన్నందున రహస్యంగా పాత కాంట్రాక్టరుకే పనులు అప్పగించి లంచం తీసుకున్నారని టీడీపీలో ఓ వర్గం ఎమ్మెల్యేపై గుర్రుగా ఉంది. దీంతో ఈ వ్యవహారంపై ఎమ్మెల్యే అనుచరులు, ఎమ్మెల్యే వ్యతిరేక వర్గం నేతల మధ్య అంతర్లీనంగా మాటల వార్ జరుగుతోంది. ఈ విషయంపై ఎమ్మెల్యే వ్యతిరేక వర్గం నేతలు పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నంలో ఉన్నట్లు సమాచారం. అయితే ఎమ్మెల్యే అనుచరవర్గం మాత్రం మరో వాదన వినిపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ట్యాంక్‌బండ్ పనులు మూడోవంతు పూర్తయ్యాయని, ప్రస్తుతం రూ.2.50 కోట్ల పనులు మాత్రమే చేయాల్సి ఉందని, ఈ పనుల్లో ఎక్కువగా కాంక్రీట్, సుందరీకరణ, సామగ్రి పనులు మాత్రమే ఉన్నాయని పేర్కొంటూ వీటిలో ఎక్కువగా లాభం ఉండే అవకాశం లేనందున పాత కాంట్రాక్టర్‌కే పనులు అప్పగించినట్లు చెబుతున్నారు. మరి ఇదే వాస్తవం అయితే ఎమ్మెల్యే స్థానిక నేతలకు పరిస్థితి వివరించి పాత కాంట్రాక్టర్‌కే పనులు ఇవ్వవచ్చు కదా అని ఎమ్మెల్యే వ్యతిరేక వర్గం ప్రశ్నిస్తోంది.



నిర్మాణంలో ఉన్న ఉదయగిరి ట్యాంక్‌బండ్

రగులుతున్న అసంతృప్తి జ్వాలలు

అధికారంలోకి వచ్చిన ఐదు నెలలకే ఉదయగిరి టీడీపీలో అసంతృప్తి జ్వాలలు రగులుతున్నాయి. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అందరినీ కలుపుకుని పోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఉదయగిరి టీడీపీలో వర్గాలు ఉన్నాయి. కాకర్ల ట్రస్టులో పని చేసిన వారికే ఎమ్మెల్యే ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరో వైపు బొల్లినేని వెంకట రామారావు వర్గంలో కొంతమంది తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. గత సార్వత్రిక ఎన్నికల ముందు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన వైఎస్సార్ సీపీ నేతలను ఎమ్మెల్యే పూర్తిగా పక్కన పెట్టారనే విమర్శలు ఉన్నాయి. వారు తమ గోడు ఎంపీ వద్ద వాపోయినట్లు తెలుస్తోంది. దీంతో ఆయన కాకర్ల దృష్టికి తీసుకుపోయినా మార్పు లేకపోవడంతో వేమిరెడ్డి కూడా అసహనంతో ఉన్నట్లు ప్రచారంలో ఉంది. ఒక వైపు సొంత పార్టీలో అంతర్గత కుమ్ములాటలు, అసంతృప్త నేతలతో సతమతమవుతున్న క్రమంలో తాజాగా లంచానికి సంబంధించిన లేఖ వ్యవహారం టీడీపీలో ప్రకంపనలు సృష్టిస్తోంది.



ఉదయగిరిలో పంచిన లేఖ ప్రతులు

లేఖపై పోలీసుల ఆరా

ట్యాంక్‌బండ్ కాంట్రాక్టు పనుల కేటాయింపు విషయంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పీఏ(పీఏ పేరు లేఖలో లేదు) రూ.కోటి లంచం తీసుకున్నారంటూ ఇటీవల ఉదయగిరిలో లేఖ ప్రతులు పంపిణీ చేశారు. అంతేకాక టీడీపీ కార్యకర్త దీనిని సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ఈ వ్యవహారంలో ఎవరి ప్రమేయం ఉందో తేల్చే పనిలో పోలీసులు నిమగ్నం అయ్యారు. ఇంతవరకు పలు దఫాలుగా రెండు వర్గాల టీడీపీ నేతలను ఉదయగిరి సీఐ, ఎస్సై పిలిపించి ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ లేఖ విడుదల విషయంలో ఎవరి ప్రమేయం ఉండవచ్చు అనే కోణంలో కూడా ఆరా తీశారు. అయితే ఈ వ్యవహారానికి సంబంధించి పోలీసుల వద్ద కొంత సమాచారం ఉన్నట్లు తెలుస్తోంది. లేఖ విడుదలలో టీడీపీ నేతల ప్రమేయం ఉన్నట్లు తేలడంతో గుట్టుచప్పుడు కాకుండా మౌనం దాల్చుతున్నట్లు తెలుస్తోంది.

పెన్షన్‌దారులకు మళ్లీ కష్టాలు



విడవలూరు సచివాలయం వద్ద పెన్షన్‌దారులు

విడవలూరు: సోమవారం విడవలూరులోని సచివాలయం వద్ద పెన్షన్ సొమ్ము అందుకునేందుకు గంటలు తరబడి పింఛన్‌దారులు బారులు తీరారు. గత ప్రభుత్వంలో వలంటీర్ ఇంటి వద్దకు వచ్చి అందించే వారని, ప్రస్తుత ప్రభుత్వంలో ఒకటో తేదీన మాత్రం టీడీపీ నాయకులతో కలసి సచివాలయ సిబ్బంది ఫొటోలు తీసుకుని పెన్షన్ అందించి పబ్లిసిటీ చేసుకుంటున్నారని వారు వాపోయారు. తర్వాత 2వ తేదీ నుంచి మరలా పాత పద్ధతిలో సచివాలయం చుట్టూ తిరిగి పెన్షన్ తీసుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం 5వ తేదీ వరకు పెన్షన్ అందించే విధానాన్ని అమలు చేస్తే బాగుంటుందని అవ్వాతాతలు కోరుకుంటున్నారు.

జాప్యం లేకుండా పరిష్కరించండి

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ ఆనంద్
- వివిధ శాఖలకు సంబంధించి 212 అర్జీలు

నెల్లూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలిస్తున్న అర్జీలను ఎక్కడా జాప్యం లేకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఓ ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్‌తో పాటు జేసీ కె.కార్తీక్, జెడ్పీ సీఈఓ విద్యారమ, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, డ్వామా పీడీ గంగాభవాని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను నిర్దిష్ట గడువులోగా పరిశీలించి పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. వివిధ శాఖలకు సంబంధించి 212 అర్జీలను ప్రజలు అందజేశారు. ఇందులో ఎక్కువగా రెవెన్యూశాఖకు సంబంధించి 95, మున్సిపల్ శాఖకు సంబంధించి 23, సర్వేకు 13, పంచాయతీరాజ్‌శాఖ 11, సివిల్ సప్లయీస్ 11, ఇరిగేషన్ 10, పోలీసుకు 6, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 5 అర్జీలు అందాయి.


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, ఇతర అధికారులు

చిరు వ్యాపారులను ఆదుకోండి



నెల్లూరు నగరంలోని 17వ డివిజన్ పరిధి ముత్తుకూరు రోడ్డు కృష్ణపట్నం కాలువ పక్కన ఎన్నో ఏళ్లుగా చిరు వ్యాపారాలు చేసుకుంటున్న తమను కార్పొరేటర్ పేనేటి సుధాకర్ ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాధితులు సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు. సీపీఎం కార్యదర్శి ఎస్‌కే నజీర్ మాట్లాడుతూ పిల్లల చదువుకు బతుకుదెరువుకు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్నారని, కొంతమంది వ్యక్తులు బలవంతంగా వారి అక్కడి నుంచి పంపాలని చూస్తున్నారన్నారు. బాధిత కుటుంబాలకు రక్షణ కల్పించి వ్యాపారాలు సజావుగా చేసుకునేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో 17వ డివిజన్ ఇన్‌చార్జి కె.సతీష్, మహిళా సంఘం నాయకురాలు మహాలక్ష్మమ్మ, భవాని, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం ఇప్పించండి

నెల్లూరు రూరల్: దామవరం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు దగదర్తి మండలం దామవరంలో 140 ఎకరాలు సేకరించారని, అయితే మాకు నష్టపరిహారం చెల్లించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామ సర్పంచ్ నిమ్మకాయల ప్రసాద్ మాట్లాడుతూ గ్రామ సర్వే నంబరు 238 నుంచి 259 వరకు ఉన్న 148 ఎకరాల భూమిని 30 ఏళ్లుగా 160 కుటుంబాలు వ్యవసాయం చేసుకుంటూ బతుకుజీవనం సాగిస్తున్నాయని తెలిపారు. ఇందులో అందరూ చిన్న,సన్నకారు రైతులే అని, వీరిలో అన్ని కులాల వాళ్లు ఉన్నారని తెలిపారు.


కలెక్టరేట్‌లో దగదర్తి మండలం దామవరం గ్రామ ప్రజలు

మోసగాళ్లపై చర్యలు తీసుకోవాలి


బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ కృష్ణకాంత్

- ఎస్పీకి బాధితుల వినతి

నెల్లూరు (క్రైమ్): తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తానని ఒకరు.. ఉద్యోగం ఇప్పిస్తానని ఇంకొకరు.. నకిలీ పత్రాలతో స్థలం కాజేసేందుకు యత్నించిన మరొకరిపై మోసగాళ్లపై చర్యలు తీసుకోవాలని పలువురు బాధితులు ఎస్పీ జి. కృష్ణకాంత్‌ను కోరారు. నగరంలోని ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 78 మంది తమ సమస్యలపై ఎస్పీకి ఫిర్యాదులు చేశారు. ఆయా ఫిర్యాదులను నిశితంగా పరిశీలించిన ఆయన చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులరెడ్డి, డీటీసీ డీఎస్పీ గిరిధర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్‌లు డి. వెంకటేశ్వరరావు, బి. శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- నెల్లూరు బాలాజీనగర్‌కు చెందిన రఘువర్ధన్ అనే వ్యక్తి తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తానని నమ్మించి తనతోపాటు మరో ఏడుగురి వద్ద సుమారు రూ.3 కోట్ల నగదు తీసుకుని మోసగించాడని నగరానికి చెందిన ఖాజామస్తాన్ ఫిర్యాదు చేశారు.
- నా భర్త 2001లో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి నేను నా పిల్లలను పోషించుకుంటున్నాను. ఇటీవల మా బావ గౌస్‌బాషా, ఆడబిడ్డలు తప్పుడు ఫ్యామిలీ సర్టిఫికెట్లు సృష్టించి తన భర్త వాటాను అమ్మేసి తనను, బిడ్డలను వేధిస్తున్నారని చేజర్లకు చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేసింది.
- నా భర్త వేరే మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ నన్ను, నా పిల్లలను పట్టించుకోవడం లేదని, ఇటీవల ఇంట్లో నుంచి గెంటేశారని నగరంలోని కోటమిట్టకు చెందిన ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేసింది.
- కిరణ్ అనే వ్యక్తి సాఫ్ట్‌వేర్ జాబ్ ఇప్పిస్తానని రూ.8 లక్షలు తీసుకుని మోసగించారని చిన్నబజారుకు చెందిన ఓ యువకుడు ఫిర్యాదు చేశాడు.
- తన కుమారుడు నాగసుబ్బారెడ్డి, ప్రసాద్ వద్ద పని చేస్తున్నాడని, నాలుగు నెలల కిందట ఎక్కడో పనికి తీసుకెళ్లారని, అప్పటి నుంచి నా కుమారుడి ఆచూకీ తెలియడం లేదని, ఆచూకీ కనిపెట్టి తన వద్దకు పంపించాలని వేదాయపాళెంకు చెందిన ఓ వృద్ధురాలు అభ్యర్థించారు.
- నెల్లూరు నగరానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి వైఎస్సార్‌నగర్‌లో ప్లాటు ఇప్పిస్తానని రూ.7 లక్షలు తీసుకుని నకిలీ పత్రాలు సృష్టించి మోసం చేశారని సంతపేటకు చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు.

క్లుప్తంగా

రైలు పట్టాలపై యువకుడి మృతదేహం

బిట్రగుంట: అల్లూరురోడ్డు– తలమంచి స్టేషన్ల మధ్య మూడో నంబరు రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని యువకుడి (30) మృతదేహాన్ని కావలి జీఆర్పీ పోలీసులు సోమవారం గుర్తించారు. మృతుడు గోధుమ రంగు చెక్స్ డిజైన్ ఉన్న ఫుల్ హ్యాండ్స్ చొక్కా, నల్లని జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతుడి జేబులో విజయవాడ– తిరుపతి రైల్వే టికెట్ ఉన్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి వద్ద 'అశోకన్ శరణ్‌రాజ్' పేరుతో ఉన్న గుర్తింపు కార్డు లభించినట్లు పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు రైల్లో నుంచి జారిపడడంతో మృతి చెంది ఉండొచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94406 27648 నంబరుకు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు విజ్ఞప్తి చేశారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్ట్

నెల్లూరు (క్రైమ్): నెల్లూరు నగరంలోని డైకస్‌రోడ్డులో నిర్వహిస్తున్న మద్యం బెల్టుషాపుపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నెల్లూరు–1 ఇన్‌స్పెక్టర్ రమేష్‌బాబు పర్యవేక్షణలో సిబ్బంది సోమవారం దాడులు చేశారు. మద్యం విక్రయిస్తున్న సంజయ్‌గాంధీనగర్‌కు చెందిన జయవేలు ఉమామహేష్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 10 క్వార్టర్ల మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు డి.శ్రీధర్, మురళీకృష్ణ, సిబ్బంది రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

11 మద్యం సీసాల స్వాధీనం

కావలి: మండలంలోని చలంచర్లలో కొమరా రమణమ్మ అక్రమంగా మద్యం విక్రయాలు చేస్తున్నట్లు సమాచారం అందుకున్న కావలి ఎక్సైజ్ సీఐ సుంకర శ్రీనివాసులు సోమవారం దాడులు చేశారు. ఆమె వద్ద నుంచి 11 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకుని, అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడిలో ఎస్‌ఐ ఎం.దేవిక, సిబ్బంది పాల్గొన్నారు.

పొదలకూరు నిమ్మధరలు



పెద్దవి : రూ.30
సన్నవి : రూ.20
పండ్లు : రూ.12

ప్రతి ఎస్టీ కుటుంబాన్ని పీఎంఈవై 2.0లో చేర్చాలి

- కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(అర్బన్): జిల్లాలో అర్హత గల ప్రతి ఎస్టీ కుటుంబానికి పక్కా గృహాన్ని మంజూరు చేసేందుకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 సర్వేలో చేర్చాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని శంకరన్ హాలు నుంచి కలెక్టర్ తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఆర్డీఓలు, సబ్ కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక అందుబాటులో ఉన్నందును ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పక్కా ఇళ్లను వేగంగా పూర్తి చేయించాలని కోరారు. మండల, డివిజన్ స్థాయిలో ఏర్పాటు చేసిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వస్తున్న ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. పాఠశాలల విద్యార్థులకు అపార్ ఐడీ కార్డుల మంజూరును సత్వరమే పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో ఎంపిక చేసిన సీసీ రోడ్లను సంక్రాంతి నాటికి పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి మట్టి పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. గ్రామాల్లో ప్రతి ట్యాంకును క్లీనింగ్ చేయాలని, వీధుల్లో చెత్తను తొలగించి బ్లీచింగ్‌ను చల్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీ కార్తీక్, డీపీఓ శ్రీధరరెడ్డి, జెడ్పీ సీఈఓ విద్యారమ, హౌసింగ్, డ్వామా, ఐసీడీఎస్ పీడీలు వేణుగోపాల్, గంగాభవాని, హేనాసుజన్, డీఈఓ బాలాజీరావు, సమగ్రశిక్ష ఏపీఓ ఉషారాణి, ఇతర శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్, పక్కనే జేసీ కార్తీక్

వర్షాల నష్టాలపై నివేదిక ఇవ్వండి

నెల్లూరు రూరల్: ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో జిల్లాలో మూడురోజులుగా కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలు, రోడ్లు, ఇళ్లు తదితర సమస్యలపై పూర్తిస్థాయిలో అంచనా వేసి నివేదికలు అందించాలని అధికారులను కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. భారీ వర్షాల నష్టాలపై కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. వర్ష ప్రభావంతో నష్టపోయిన బాధితులందరిని ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి, ఏపీ మైక్రో ఇరిగేషన్ పీడీ శ్రీనివాసులు, జిల్లా ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి, పంచాయతీరాజ్‌శాఖ ఎస్‌ఈ అశోక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ డి.వెంకటరమణ, గృహ నిర్మాణశాఖ పీడీ వేణుగోపాల్, డీఈఓ బాలాజీరావు, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

పెన్నాలో చిక్కుకున్న ఆరుగురు పశువుల కాపరులు


పెన్నానదిలో చిక్కుకున్న పశువుల కాపరులు


ఒడ్డుకు చేరిన పశువుల కాపరులు

- రెస్క్యూ టీమ్ సాయంతో సురక్షితం

కోవూరు: పశువులు మేపుకొనేందుకు పెన్నానదిలోకి వెళ్లిన ఆరుగురు అనుకోకుండా వరద నీటిలో చిక్కుకొన్నారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ, పోలీసులు రెస్క్యూ టీమ్ సహకారంతో వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. ఈ ఘటన సోమవారం సాయంత్రం మండలంలోని ఇనమడుగు పంచాయతీ జమ్మిపాళెం సమీపంలో పెన్నానదిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. జమ్మిపాళెంకు చెందిన పశువుల కాపరులు చల్లకొలుసు కావమ్మ, మందపల్లి నవీన్, యటగిరి గోవిందయ్య, కత్తి విగ్నేష్, కత్తి వెంకటరమణయ్య తమ పశువులను మేపుకుంటూ నది సగంలోకి వెళ్లారు. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి నెల్లూరు బ్యారేజ్‌కు వరదనీరు అధికంగా రావడంతో సోమవారం మధ్యాహ్నం బ్యారేజీ అధికారులు రెండు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ఈ విషయం తెలియని పశువుల కాపరులు పశువులు తోలుకుని పెన్నా నదిలోకి వెళ్లారు. ఒక్కసారిగా వరదనీరు వారిని చుట్టూ ముట్టడంతో ఏమి చేయాలో దిక్కు తోచలేదు. నదిలో పశువుల కాపరులు చిక్కుకున్నారని తెలుసుకున్న తహసీల్దార్ నిర్మలందబాబా, సీఐ సుధాకర్‌రెడ్డి ఎస్‌ఐ రంగనాథ్‌గౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మార్గమధ్యంలోనే రెస్క్యూ బృందానికి సమాచారం అందజేశారు. వారు బోట్ల సాయంతో పెన్నా నది వద్దకు చేరుకుని పశువుల కాపరులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించేటప్పటికీ సాయంత్రం అయింది. అసలే వాతా వరణం మేఘావృతంగా ఉండడంతో చీకట్లు కమ్ముకోవడంతో ప్రత్యేక లైట్ల సహాయంతో వారిని ఒడ్డుకు చేర్చారు.

పాలం వివాదంలో దాడి

మర్రిపాడు: కుటుంబ సభ్యుల మధ్య పొలం వివాదమై జరిగిన దాడిలో ఓ మహిళ గాయపడింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని నందవరం గ్రామానికి చెందిన శిల్ప తండ్రికి చెందిన సర్వే నంబరు 123, 133లోని 3.90 ఎకరాల భూమి ఉంది. శిల్ప ఏకైక వారసురాలు కావడంతో ఆ భూమిలో ఆమె జామాయిల్ వేసుకుని సాగు చేస్తోంది. అయితే ఈ భూమి విషయమై ఆమెకు, పెద్దనాన మధ్య వివాదం రావడంతో కోర్టులో కేసు నడుస్తోంది. ఈ తోటకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఉండగా ఆమె పెద్దనాన వాళ్లు వాటిని ఆదివారం ధ్వంసం చేశారు. దీనిపై అడగడానికి వెళ్లిన శిల్పపై విచక్షణ రహితంగా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం ఘటన స్థలాన్ని పరిశీలించి, ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులు లాక్కొంటారని..

- రూ.6 వేలు పోగొట్టుకున్న పానీపూరి వ్యాపారి

కావలి: పొద్దుపొద్దున్నే స్నేహితులతో కావలి రైల్వే స్టేషన్ సమీపంలోని కూల్‌డ్రింక్స్ షాపులో సిట్టింగ్ వేసిన ఓ మందుబాబుకు ఊహించని షాక్ తగిలింది. తన జేబులో డబ్బులు పోలీసులు లాక్కొంటారని ఆటో సీటు కింద పెట్టి రూ.6 వేలు పోగొట్టుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలో పానీపూరి నడిపే ఓ మందుబాబు నాలుగు రోజుల నుంచి ముసురుపట్టిన వాతావరణంలో మందుతో ఎంజాయ్ చేద్దామనుకున్నాడు. రైల్వే రోడ్డులోని ఓ షాపులో మద్యం కొని తన మరో ముగ్గురు స్నేహితులతో కలిసి అక్కడే ఉన్న కూల్ డ్రింక్ షాపులో ఛీర్స్ కొట్టుకున్నారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఒకటో పట్టణ పోలీసులు మందుబాబుల వ్యవహారం చూసి పొద్దుపొద్దున్నే ఇదేం పనంటూ స్టేషన్‌కు నడవమన్నారు. అటుగా పోతున్న ఆటోను ఆపి అందులో నలుగురు మందుబాబులను ఎక్కించి స్టేషన్‌కు పోనివ్వమన్నారు. ఇంతలో పానీపూరీ వ్యాపారికి తన జేబులో రూ.6 వేలు ఉన్న విషయం గుర్తుకు వచ్చాయి. స్టేషన్‌కు వెళితే ఆ డబ్బులు పోలీసులు లాక్కొంటారనే భయంతో ఆటో సీటు కింద దాచి పెట్టాడు. స్టేషన్‌లో ఆటో దిగి చిన్నగా ఆటోడ్రైవర్ చెవిలో గుసగుసలాడాడు. పోలీసులు నీకు బాడుగ ఇవ్వరు, వెనుక సీటు కింద రూ.6 వేలు దాచి పెట్టాను. ఒక్క అరగంట తర్వాత మేము బయటకు రాగానే నీ బాడుగ డబ్బులు నేనే ఇస్తా. అప్పటి వరకు సీటు కింద ఉన్న రూ.6 వేలు జాగ్రత్తగా చూస్కో అని చెప్పి స్టేషన్‌లోకి వెళ్లాడు. పోలీసులు అరగంట కౌన్సెలింగ్ ఇచ్చి ఇక వెళ్లమన్న తర్వాత బయటకు వచ్చి చూస్తే ఆటో అక్కడ లేదు. దీంతో లబోదిబోమంటూ అదృశ్యమైన ఆటోడ్రైవర్ కోసం వెతుకులాట మొదలు పెట్టారు.

పురుగుమందు తాగి మహిళ ఆత్మహత్య

ఆత్మకూరు: భర్తకు అనారోగ్యం, పిల్లలు దూరంగా ఉండడం తదితర కారణాలతో మనస్తాపానికి గురైన ఓ మహిళ పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఆత్మకూరు ఎస్సై షేక్ జిలాని కథనం మేరకు మండలంలోని కరటంపాడుకు చెందిన కొత్తకోట రమణమ్మ (52) భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇద్దరికి వివాహాలై దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో ఆమె భర్త పక్షవాతానికి గురయ్యాడు. అండగా ఉండాల్సిన పిల్లలు లేకపోవడం, భర్త అనారోగ్యంతో మంచం పట్టడంతో తీవ్ర మనస్తాపానికి గురైన రమణమ్మ ఆదివారం రాత్రి పురుగు మందు ఆత్మహత్యాయత్నం చేసింది. విషయం తెలుసుకున్న బంధువులు ఆమెను వైద్యం కోసం తొలుత ఆత్మకూరు, అనంతరం నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

బాలికతో వృద్ధుడి అసభ్యకర ప్రవర్తన

- దేహశుద్ధి చేసిన బాలిక బంధువులు
- పోలీసులకు ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు

ఉదయగిరి: మనమరాలి వయస్సు ఉన్న తొమ్మిదేళ్ల బాలికతో 63 ఏళ్ల విశ్రాంతి ఉద్యోగి అసభ్యకరంగా ప్రవర్తించడంతో బాలిక తల్లిదండ్రులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన ఉదయగిరిలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు నిందితుడిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఉదయగిరికి చెందిన విశ్రాంతి ఉద్యోగి నల్లబోతుల లక్ష్మీనారాయణ ఆదివారం రాత్రి 3వ సచివాలయం దగ్గర ఉన్నారు. అదే ప్రాంతానికి చెందిన 4వ తరగతి చదువుతున్న ఓ బాలిక షాపులో ఐస్‌క్రీమ్ తీసుకుని ఇంటికి బయలు దేరింది. ఈ నేపథ్యంలో బాలికను పిలవడంతో లక్ష్మీనారాయణ వద్దకు వెళ్లగా ఆ బాలికతో అసభ్యకర రీతిలో ప్రవర్తించాడు. దీంతో భయపడిన బాలిక పరుగున ఇంటికి వెళ్లి జరిగిన విషయం తల్లిదండ్రులకు చెప్పింది. వారు అక్కడికి చేరుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. బాధిత బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఇంద్రసేనా రెడ్డి పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి సోమవారం కోర్టులో హాజరు పరిచారు.

4 నుంచి డీకేడబ్ల్యూలో సర్టిఫికెట్ కోర్సు

నెల్లూరు (టౌన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఈ నెల 4వ తేదీ నుంచి కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ నాన్ వాయిస్ సర్టిఫికెట్ కోర్సును ప్రారంభిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ గిరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో 30 సీట్లు ఉన్నాయన్నారు. ఈ కోర్సులో చేరేందుకు 10వ తరగతి లేదా ఆపైన కోర్సులు చదివి ఉండి వయస్సు 18 నుంచి 35 ఏళ్ల లోపు మహిళలు అర్హులన్నారు. ఈ కోర్సుకు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని చెప్పారు. ఆసక్తి ఉన్న మహిళలు ఈ కోర్సులో చేరేందుకు కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఇద్దరికి కరెంట్ షాక్

- తప్పిన ప్రమాదం

చేజర్ల: మండలంలోని ఆదూరుపల్లి మెయిన్ రోడ్డులో హెయిర్ కటింగ్ షాపు వద్ద విద్యుత్ షాక్‌తో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం సాయంత్రం జరిగింది. షాపు పక్కనే ఉన్న ఇనుప పోల్ వద్ద ఓ చిన్నారి ఆడుకుంటూ దానికి తగలడంతో కరెంట్ షాక్ కొట్టి కింద పడిపోయింది. అటుగా వెళ్తున్న షేక్ మస్తాన్ అది గమనించి పాపను రక్షించే ప్రయత్నం చేయగా అతనికి షాక్ కొట్టింది. దీంతో హెయిర్ కటింగ్ షాపులో ఉన్న వ్యక్తి వెంటనే మెయిన్ ఆపడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు


బాలుర విన్నర్ కర్నూలు జిల్లా జట్టు


బాలికల విన్నర్ కర్నూలు జిల్లా జట్టు


బాలుర రన్నర్ శ్రీ సత్యసాయి జిల్లా జట్టు

కావలి: పట్టణంలోని మద్దూరుపాడులో ఉన్న డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో 2వ రాష్ట్ర స్థాయి మినీ సబ్‌జూనియర్ అండర్–12 బాలబాలికల రగ్బీ ఛాంపియన్ షిప్ పోటీలు సోమవారం ముగిశాయి. ఆ కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు మాట్లాడుతూ క్రీడాపోటీల నిర్వహణకు తమ కళాశాల యాజమాన్యం ఎప్పుడూ సహకరిస్తుందన్నారు. సీనియర్ రాష్ట్ర జాతీయ స్థాయి పోటీలకు ఇక్కడే నిర్వహించుకునేందుకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. అనంతరం విజేతలకు కప్పులు, పతకాలు, ప్రశంస పత్రాలను అందజేసి అభినందించారు. బాలుర విభాగంలో కర్నూలు, శ్రీ సత్యసాయి, నెల్లూరు జిల్లా జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలిపొందారు. బాలికల విభాగంలో కర్నూలు, శ్రీ సత్యసాయి, కృష్ణా జిల్లా జట్లు మొదటి, రెండో, మూడో స్థానాల్లో విజయం సాధించారు. ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం, ఫిజికల్ డైరెక్టర్ మురళి, భోజన వసతి దాత జి. శ్రీను సహకారంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వివిధ జిల్లాలకు చెందిన రగ్బీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.


రన్నర్: శ్రీ సత్యసాయి జిల్లా బాలికల జట్టు


మూడోస్థానం: నెల్లూరు జిల్లా బాలుర జట్టు


మూడోస్థానం: కృష్ణా జిల్లా బాలికల జట్టు